జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం | 19 | మే | 2026 ◆ పేజీలు : 5



## సంక్షేమ పథకాలను సత్వరమే అందించాలి

- ఐటీడీఏ పీవో బి.రాహుల్



**భద్రాచలం టౌన్, మే 18 ప్రజాజ్యోతి** వివిధ ఆదివాసి గిరిజన గ్రామాల నుంచి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధ సంక్షేమ పథకాల కొరకు అర్జీలు పెట్టుకునే గిరిజనులకు సత్వరమే అందేలా సంబంధిత యూనిట్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ యూనిట్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్ లో వివిధ ఆదివాసి గిరిజన గ్రామాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి దరఖాస్తులను, ఫిర్యాదులను సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఎస్ డి సి ఆనంద్ కుమార్, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అశోక్, ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, ఏడిఎంహెచ్వో సైదులతో

మిగతా 2 లో...



# కాంగ్రెస్‌లో అసంతృప్తి జ్వాలలు..

- కష్టపడ్డ వారికి గుర్తింపు లేదా?
- పార్టీ పదవులకు రాజీనామాలకు సిద్ధమైన నేతలు
- పదవుల కేటాయింపుపై నేతల నిరసన
- హైకమాండ్ దృష్టికి సమస్య తీసుకెళ్తా- పొదెం వీరయ్య

**చర్ల, మే 18:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని కేఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఇటీవల ప్రకటించిన చర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడి నియామకంపై అసంతృప్తితో ఉన్న పలువురు సీనియర్ నాయకులు సమావేశంలో బహిరంగంగానే తమ ఆవేదన, అసహనం వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య హాజరై నాయకులతో విస్తృతంగా చర్చించారు. సమావేశం ప్రారంభం నుంచే మండల అధ్యక్షుడి నియామక అంశం హాట్ టాపిక్‌గా మారింది. ఈ సందర్భంగా చర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీనివాసరావు మాట్లాడుతూ మాట్లాడుతూ మండల అధ్యక్షుడి ఎంపిక పూర్తిగా ఏకపక్ష నిర్ణయమని ఆరోపించారు. పార్టీ కోసం దశాబ్దాలుగా కష్టపడి పనిచేస్తున్న సీనియర్ నాయకులను సంప్రదించకుండా, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా తీసుకున్న నిర్ణయం తమను తీవ్రంగా బాధించిందన్నారు. గ్రామ స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి ఎన్నో కష్టాలు పడ్డామని పార్టీ అధికారంలో లేకున్నా జెండా మోసి ప్రజల్లో తిరిగామని కానీ ఇప్పుడు తమ సేవలకు తగిన గౌరవం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ మహిళా నాయకురాలు మాజీ జడ్పిటిసి సభ్యురాలు ఇర్పా శాంతా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు పార్టీ కోసం కష్టపడి పని చేస్తూ గెలుపు కోసం అహర్నిశలు శ్రమించామని జడ్పిటిసిగా, ఎంపీటీసీగా, సర్పంచ్ గా కాంగ్రెస్ పార్టీలో వివిధ పదవుల్లో పని చేసానని అలాంటి సీనియర్ నైన

మిగతా 2 లో...

## రాయల్ ట్రావెల్స్ బస్సు పల్టీ

- మహిళ మృతి
- పలువురు ప్రయాణికులకు గాయాలు



**చర్ల, మే 18:(ప్రజా జ్యోతి )** జాతీయ రహదారి-30పై సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదం విషాదాన్ని మిగిల్చింది. రాయ్‌పూర్ నుంచి కొంటా వైపు వెళ్తున్న రాయల్ ట్రావెల్స్‌కు చెందిన ప్రయాణికుల బస్సు బస్తర్ జిల్లా బాలెంగా సమీపంలో అదుపుతప్పి పల్టీ కొట్టింది. వేగంగా వెళ్తున్న బస్సు ఒక్కసారిగా నియంత్రణ కోల్పోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 30 నుంచి 35 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. ఘటనలో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. కొంత మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న వెంటనే

మిగతా 2 లో...

## యువత టూరిజం రంగంలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

- యువ టూరిజం క్లబ్ పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, మే 18,(ప్రజాజ్యోతి)** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మే 18 నుండి 23 వరకు నిర్వహించనున్న టూరిజం వారోత్సవాల సందర్భంగా "యువ టూరిజం క్లబ్" పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యాటక రంగానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని, యువత టూరిజం రంగంపై అవగాహన పెంపొందించుకొని ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో

మిగతా 2 లో...

## యువత టూరిజం రంగంలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి...)

నిర్వహిస్తున్న కార్యక్రమాలు యువతలో పర్యాటక ప్రదేశాల పట్ల ఆసక్తి పెంచడంతో పాటు వారసత్వ సంపద పరిరక్షణపై అవగాహన కల్పిస్తాయని తెలిపారు. టూరిజం వారోత్సవాల సందర్భంగా జిల్లాలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా మే 19న పాల్వంచలోని కిన్నెరసాని ప్రాజెక్ట్ వద్ద టూరిజం అవేర్‌నెస్ డ్రైవ్, మే 20న లక్ష్మీదేవిపల్లి మండలంలోని కారుకొండ రామవరం బౌద్ధ రాక్ కేవ్స్ వద్ద హెరిటేజ్ వాక్, మే 21న జిల్లాలోని యూట్యూబర్లతో సమావేశం, మే 22న బౌద్ధ రాక్ కేవ్స్ ప్రాంతంలో స్వచ్ఛత డ్రైవ్, మే 23న పాల్వంచలోని ఐడాక్‌లో బ్రాండ్ కిట్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు .టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న “సర్టిఫికేట్ కోర్స్ ఆన్ మ్యూజియాలజీ” “సర్టిఫికేట్ కోర్స్ ఆన్ ఆర్కియాలజీ” కోర్సులను యువత వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కోర్సుల ద్వారా పర్యాటక, పురావస్తు, మ్యూజియం రంగాల్లో ఉపాధి అవకాశాలు పొందవచ్చని తెలిపారు. కోర్సులకు సంబంధించిన పూర్తి వివరాల కోసం కో–ఆర్డినేటర్ డాక్టర్ పి. నాగరాజును సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు 9849905722, 9849905723 అందుబాటులో ఉంటాయన్నారు.

## సంక్షేమ పథకాలను సత్వరమే అందించాలి

(మొదటి పేజీ తరువాయి...)

కలసి స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించారు. ఏజెన్సీ ఏరియాలోని పలు మండలాలు, గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో గిరిజనులు హాజరై తమ వ్యక్తిగత, సామూహిక సమస్యలను పి ఓ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఏవో సున్నం రాంబాబు, ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్, ఏపీవో పవర్ వేణు, పి వి టి జి అధికారి గన్యా, ఎల్ టి ఆర్ డి టి మణిధర్, మిషన్ భగీరథ ఏ ఈ ఈ నారాయణరావు, హౌసింగ్ ఏఈ హేమంత్, ఐసిడిఎస్ సూపర్వైజర్ చంద్రకళ పాల్గొన్నారు.

## రాయల్ ట్రావెల్స్ బస్సు పల్టీ

(మొదటి పేజీ తరువాయి...)




బస్తర్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. స్థానికుల సహాయంతో గాయపడిన వారిని బయటకు తీసి అంబులెన్సుల ద్వారా డిమ్రాపాల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటన బస్తర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకోగా, ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఆరోగ్యం అందరి బాధ్యత...

- -బూర్గంపహాడ్లో 2కె రన్ విజయవంతం




**బూర్గంపహాడ్, మే 18 (ప్రజా జ్యోతి):** నేటి ఆధునిక యుగంలో మానవ జీవనశైలిలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని...ఈ క్రమంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యతని ఎంపీడీవో జమలారెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రమైన బూర్గంపహాడ్ లో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించిన 2కె రన్ విజయవంతమైంది. బూర్గంపహాడ్ సెంటర్ నుంచి నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామ శివారు గొమ్మూరు వరకు, అక్కడి నుంచి తిరిగి మండల కేంద్రంలో అంబేద్కర్ సెంటర్ వరకు 2కె రన్ సాగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతిఒక్కరికీ వ్యాయామం ఎంతో అవసరమని, శారీరిక ధృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసానికి ఇలాంటి 2కె రన్లు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. 2కె రన్లో ప్రజాప్రతినిధులు, పోలీసుశాఖ, పంచాయతీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొని విజయవంతం చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సెలు మేడా ప్రసాద్, దేవసింగ్, బూర్గంపహాడ్ సర్పంచ్ మందా నాగరాజు, ఉపసర్పంచ్ గుండె వెంకన్న, ఎంపీడీవో కార్యాలయ, పంచాయతీ సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో అసంతృప్తి జ్వాలలు..

(మొదటి పేజీ తరువాయి...)



నాకు జిల్లాలో ఈసీ మెంబర్ పదవి ఇవ్వటం నన్ను తీవ్రంగా కలచివేసిందని అయినా కాంగ్రెస్ పార్టీ నిర్ణయానికి కట్టుబడి అసంతృప్తిగా ఉన్నా అధిష్టానం నిర్ణయం మేరకు మౌనంగా ఉన్నానని నేడు కాంగ్రెస్ పార్టీ చర్ల మండల అధ్యక్షుడు నియామకంపై తీసుకున్న ఏకపక్ష నిర్ణయం సరికాదని సీనియర్లు ఎవరితో సంప్రదించలేదని భవిష్యత్తులో సొసైటీ పదవి కూడా వేరే వారికి వెళుతుందని ప్రస్తుత పరిస్థితులు కనబడుతున్నాయని కాంగ్రెస్ పార్టీకి అండగా కష్టసమయాల్లో వెన్నుదన్నుగా ఉన్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బండారు రామకృష్ణకి చర్ల మండల సొసైటీ చైర్మన్ పదవి ఇవ్వాలని లేనియెడల తమ పదవులకి కూడా రాజీనామా చేసేందుకు వెనుకాడబోమని అన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు తీవ్ర భావోద్వేగంతో మాట్లాడుతూ “పార్టీ కష్టకాలంలో మేమే కాంగ్రెస్‌కు అండగా నిలిచాం అని ఎన్నో ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేశాం అని ఎన్నో అవమానాలు భరించాం అని కానీ ఇప్పుడు మాకు గుర్తింపు లేకుండా పోయింది” అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం జీవితాంతం కష్టపడిన సీనియర్లను పక్కన పెట్టి, ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి కీలక పదవులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

చర్ల సొసైటీ చైర్మన్ పరుచూరి రవికుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీని 70 మంది సభ్యులతో నియమించడం జరిగిందని అందులో ఏడుగురికి చర్ల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు పదవులు ఇవ్వడం జరిగిందని కానీ ఆ పదవులపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంతృప్తికరంగా లేరని అయినా కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తులో తీసుకునే నిర్ణయాలకు తమను సంప్రదిస్తుందని భావనతో మౌనంగా పార్టీ పదవులలో కొనసాగుతున్నామని కానీ మండల అధ్యక్ష పదవిలో ఏకపక్ష నిర్ణయంతో తీవ్ర అసంతృప్తి లోనయ్యామని ఇది సరైన విధానం కాదని అన్నారు .కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల పంచాయతీ సర్పంచ్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఓడించేందుకు ఇతర పార్టీల అభ్యర్థులకు మద్దతుగా పనిచేసిన వారికే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో కీలక పదవులు ఇవ్వడం పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ అభ్యర్థుల ఓటమికి వ్యూహాలు రచించిన వారే ఇప్పుడు పార్టీ పదవుల్లో కొనసాగుతుండడం నిజాయితీగా పని చేసిన కార్యకర్తలకు అవమానమని మండిపడ్డారు. పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారిని ప్రోత్సహించడం వల్ల కష్టపడి పనిచేసిన కార్యకర్తల మనోభావాలు దెబ్బతింటున్నాయని అన్నారు .సమావేశంలో పలువురు కార్యకర్తలు కూడా తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీ కోసం ప్రచారం చేసిన కార్యకర్తలకు కనీస గౌరవం కూడా దక్కడం లేదని వాపోయారు.

పార్టీని బలోపేతం చేసిన వారిని పక్కన పెట్టి ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల కార్యకర్తల్లో తీవ్ర నిరాశ నెలకొందన్నారు. స్థానిక పరిస్థితులు తెలియకుండా తీసుకుంటున్న నిర్ణయాలు పార్టీకి తీవ్ర నష్టం కలిగించే అవకాశం ఉందని హెచ్చరించారు. కొంతమంది సీనియర్ నాయకులు తీవ్ర అసంతృప్తితో తమ పార్టీ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు సమావేశంలోనే ప్రకటించడం కలకలం రేపింది. ఈ ప్రకటనతో సమావేశంలో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కొందరు నాయకులు భావోద్వేగానికి గురై పార్టీ తమను అవమానించిందని వ్యాఖ్యానించగా, మరి కొందరు ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ కోసం పనిచేయడం చాలా కష్టమని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ కోసం కష్టపడుతున్న మాకు సరైన గుర్తింపు లేదు అని కొత్తగా వచ్చిన వారికే అన్ని అవకాశాలు ఇస్తున్నారు అని మా అనుభవాన్ని, సేవలను పట్టించుకోవడం లేదు అంటూ పలువురు నేతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం రాత్రింబవళ్లు కష్టపడిన వారిని పక్కన పెట్టడం వల్ల భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ బలహీనపడే ప్రమాదం ఉందన్నారు.

పార్టీ అధిష్ఠానం స్థానిక పరిస్థితులను అర్థం చేసుకుని నిర్ణయాలు తీసుకోవాలని చర్ల మండలంలో కాంగ్రెస్ పార్టీని నిలబెట్టింది సీనియర్ నాయకులే అని అలాంటి వారిని నిర్లక్ష్యం చేస్తే పార్టీకి నష్టం తప్పదన్నారు. పార్టీ లోపలి సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే కార్యకర్తల్లో మరింత అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.ఈ సందర్భగా మాజీ ఎమ్మెల్యే పోదెం వీరయ్య మాట్లాడుతూ .ఎవరూ తొందరపడి రాజీనామాలు చేయవద్దని భావోద్వేగ నిర్ణయాలు తీసుకోకూడదని సూచించారు. మీ అందరి సమస్యలను తాను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు కాంగ్రెస్ హైకమాండ్ నాయకులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.సీనియర్ నాయకుల సేవలను పార్టీ ఎప్పటికీ విస్మరించదని ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా తాను ప్రయత్నిస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలంటే అందరూ ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యకర్తలు, నాయకులు ఎవరూ పార్టీని వీడకుండా కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమావేశం ముగిసే సమయానికి కొంత మంది నాయకులు శాంతించినప్పటికీ అసంతృప్తి మాత్రం స్పష్టంగా కనిపించింది. చర్ల కాంగ్రెస్‌లో చోటుచేసుకున్న ఈ పరిణామాలు ప్రస్తుతం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

మండల అధ్యక్షుడి నియామకంపై మొదలైన ఈ అసంతృప్తి భవిష్యత్తులో పార్టీపై ఎలాంటి ప్రభావం చూపుతుందో అనే అంశంపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతుంది. ఈ సమావేశంలో చర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీనివాసరావు, చర్ల సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, ఉప సర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, చల్ల సొసైటీ చైర్మన్ పరుచూరి రవికుమార్, మాజీ జెడ్పిటిసి సభ్యురాలు ఇర్ప శాంత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జవ్వాది రవికుమార్, బండారు రామకృష్ణ ,ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు .

## టేకులపల్లి లో ఉత్సాహంగా 2కె రన్





**టేకులపల్లి,మే18,ప్రజాజ్యోతి:** ప్రజా పాలన –ప్రగతి ప్రణాళిక’లోభాగంగా సోమవారం టేకులపల్లిలో పోలీసు,మండల పరిషత్, విద్యాశాఖల ఆధ్వర్యంలో ఉత్సాహంగా టూ కే నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇల్లందు డీఎస్పీ వెంకన్నబాబు హాజరై జెండా ఊపి టూ కె రన్ ప్రారంభించారు. టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్సై రాజేందర్, ఎంపీఓ గణేష్ గాంధీలు మాట్లాడుతూ దృఢమైన ఆరోగ్య తెలంగాణ సాధన ధ్యేయంగా యువత నడుము బిగించాలని వారు అన్నారు.ప్రతి మనిషి కి ఆరోగ్యమే – మహాభాగ్యంఅనే సూక్తిని మరవకుండా ప్రతి ఒక్కరూ ఉదయం వ్యాయామం అలవర్చుకోవాలని అన్నారు. వాటి తో పాటు ధ్యానం, యోగాతో జీవితాన్ని, శరీరాన్ని తమ కంట్రోల్లో ఉంచుకోవడం వల్ల దీర్ఘకాలిక వ్యాధులను దూరం చేసుకోవచ్చని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ గణేష్‌గాంధీ, సీఐలు బత్తుల సత్యనారాయణ, తాటిపాముల సురేష్, తిరుపతి, ఎస్సై అలకుంట రాజేందర్,ఎంఈఓ జగన్,కె. శ్రీనివాస్, టేకులపల్లి సర్పంచ్ బోడా బాలునాయక్, బోలియా తండా సర్పంచ్ లకావత్ నాకా నాయక్,పలు సర్పంచులు, అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనులను చైతన్యపరిచి వారికి మౌలిక సదుపాయాలు కల్పించాలి

- భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్




**భద్రాచలం టౌన్, మే 18 ప్రజాజ్యోతి** జెన్ భాగీ దారి సబ్సే దూర్, సబ్సే పేహలే అనే నినాదంతో వివిధ శాఖల అధికారులు గిరిజనులను చైతన్య పరిచి వారికి కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించడానికి మీ గ్రామాలకు వస్తున్నందున గిరిజన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. సోమవారం నాడు భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఐటీడీఏ యూనిట్ అధికారులు, గిరిజనుల సమక్షంలో జెన్ జాతీయ గరిమ ఉత్సవ్ 2026 జన్ భాగి దారి అభియాన్ సబ్సే దూర్ సబ్సే పహలే కార్యక్రమాన్ని పీవో రాల్ లాంచనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మారుమూల అటవీ ప్రాంతాలలో నివసించే గిరిజన కుటుంబాలు వారి ఆచారాలు, వారి జీవన శైలి, పద్ధతులు చాలా పురాతనంగా ఉంటాయన్నారు. ఆ గిరిజనులకు ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టే ప్రతి సంక్షేమ పథకాలు అందించడానికి గ్రామంలోనీ గిరిజన యువకులు, మహిళల సహాయంతో గ్రామంలో ఇంటింటికి, పొలాల గట్ల వెంబట తిరిగి సమస్యలు తెలుసుకుని వారికి కావలసిన మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. ఈనెల 18 నుండి 25 వరకు గ్రామంలో నిర్వహిస్తున్న ప్రతి కార్యక్రమం ఫోటో కవరేజ్ వీడియో కవరేజ్ తప్పనిసరిగా చేయాలని అన్నారు గిరిజనుల సంక్షేమం కొరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలు ప్రతి శాఖ అధికారి నిర్లక్ష్య వైఖరి కనబరచకుండా ప్రత్యేక శ్రద్ధతో అమలుచేసి ప్రతి ఒక్క గిరిజనులకు లబ్ధి చేకూరేలా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ ఏరియా పరిధిలోని 130 గ్రామాలు, ఖమ్మం జిల్లాలో 30 గ్రామాలలో అధికారులు ప్రత్యేకంగా ఇంటింటికి తిరిగి గ్రామములోని గిరిజనుల సమస్యలు తెలుసుకుని వారికి కావలసిన సంక్షేమ పథకాలు వివరాలు ప్రజల భాగస్వామ్యంతో సేకరించి ప్రతిపాదనలు తయారు చేస్తారని అన్నారు.ఈ కార్యక్రమాలకు సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని అశోక్, పి వి టి జి అధికారి గన్యా, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, ఏడిఎం హెచ్వో సైదులు, ఎస్ డి సి ఆనందకుమార్, ఏ పీ ఓ పవర్ వేణు పాల్గొన్నారు.

# మెడికల్ షాపుల బంద్ నోటిస్ అందజేత





**ఇల్లందు, మే 18, ప్రజాజ్యోతి:** ఈనెల 20న జరగనున్న మెడికల్ షాపుల బంద్ నోటీసులను సోమవారం ఇల్లందు కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ లకు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కెమిస్ట్ అండ్ డ్రగ్జిస్ట్ అసోసియేషన్ బాధ్యులు మాట్లాడుతూ ఫార్మా రంగాన్ని చిన్న వ్యాపారులను దెబ్బ తీసే విధానాలను కేంద్ర ప్రభుత్వం విడనాడాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా కోవిడ్ కాలంలో జారీ చేసిన తాత్కాలిక నోటిఫికేషన్ జిఎస్ఆర్ 220 ఈ ఫార్మసిలకు సంబంధించిన జిఎస్ఆర్ 817 (ఈ) నోటిఫికేషన్ను తక్షణమే రద్దు చేయాలని కోరారు. ప్రజల ఆరోగ్యాలతో ముడిపడి ఉన్న ఆన్లైన్ మందుల విక్రయాలను పూర్తిగా రద్దు చేయాలని, కార్పొరేట్ సంస్థల అనైతిక డిస్కౌంట్లను అరికట్టాలని, అందరికీ సమాన అవకాశాలు కల్పించేలా లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు పసుమర్తి లక్ష్మణ్ రావు, కోశాధికారి జహీర్ అహ్మద్, జిల్లా జాయింట్ సెక్రెటరీ కొత్తూరు రామారావు, ఈసీ మెంబర్ అంబోజు సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

- -బూర్గంపహాడ్ మాక్ డ్రిల్ నిర్వహణలో కలెక్టర్ అంకిత్



**బూర్గంపహాడ్, మే 18 (ప్రజా జ్యోతి):** ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు అధికారులు, సిబ్బంది, యువత, విద్యార్థులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో ముందస్తు అప్రమత్తత, శాఖల మధ్య సమన్వయంతో ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించవచ్చని కలెక్టర్ అంకిత్ సూచించారు. సోమవారం మండల కేంద్రమైన బూర్గంపహాడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మాక్ డ్రిల్ కు ఆయన హాజరయ్యారు. తొలుత పునరావాస కేంద్రం, ఆపరేషన్ సెంటర్లు, వైద్య శిబిరాలను కలెక్టర్ పరిశీలించారు. జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్), తెలంగాణ రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్డిఆర్ఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాక్ డ్రిల్ పలువురిని ఆకట్టుకుంది. ఫైర్ శాఖ అధికారి క్రాంతికుమార్ అధ్వర్యంలో నిర్వహించిన ఈ మాక్ లు 6వ బెటాలియన్ టీజీఎస్పీకి చెందిన శంకర్, సీఆర్పీఎఫ్ కమాండర్ రాజేష్ దోగ్రా అబ్జర్వర్లుగా వ్యవహరించారు. వరద ప్రభావిత ప్రాంతాల నుంచి ప్రజలను లైఫ్ జాకెట్లు, బోట్లు సహాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించడం, అంబులెన్స్ల ద్వారా పునరావాస కేంద్రాలకు చేర్చడం, బాధితులకు తాగునీరు, భోజనం, వైద్యసేవలు, తాత్కాలిక నివాస సదుపాయాలు కల్పించడం వంటి చర్యలను డెమో రూపంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో భాగంగా బూర్గంపహాడ్ ఎస్సీ కాలనీ నుంచి 10 మంది గర్భిణులు, 45 మంది చిన్నారులు, 26 పశువులను సురక్షితంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పునరావాస కేంద్రానికి తరలించారు. అక్కడే బాధితులకు తక్షణ వైద్యసేపలు, ఆశ్రయం, తాగునీరు, ఆహార సదుపాయాలు కల్పించారు. వివిధ శాఖల అధికారులు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఫైర్, రెవెన్యూ, ఇరిగేషన్, వైద్య, పశు సంవర్ధకశాఖల సిబ్బంది సమన్వయంతో సేవలు అందించడమే కాకుండా గజ ఈతగాళ్ల సహాయంతో చేపట్టే రెస్క్యూ విధానాలను ప్రాక్టికల్గా ప్రదర్శించారు. ఈ అవగాహన సదస్సులో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ విపత్తుల సమయంలో గోల్డెన్ అవర్లో తీసుకునే చర్యలు ప్రాణరక్షణకు కీలకమని, శాఖల మధ్య సమన్వయంతో తక్షణ సహాయం అందించాల్సిన అవసరం ఉందన్నారు. మాక్ అల్ ద్వారా జిల్లా యంత్రాంగం అత్యవసర పరిస్థితుల్లో క్రమశిక్షణ, సమన్వయంతో పనిచేసే సామర్థ్యాన్ని ప్రదర్శించిందని, భవిష్యత్లో సంభవించే ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కొనడానికి ఇలాంటి మాక్ డ్రిల్లు ఎంతో ఉపయోగపడతాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి , డీఎంహెచ్వి తుకారాం రాథోడ్, జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు, ఏడీఏ తాతారావు, బూర్గంపహాడ్ తహశీల్దార్ కేఆర్కే ప్రసాద్, ఎంపీడీవో జమలా రెడ్డి, సీహెచ్సీ, పీహెచ్సీ వైద్యులు ముక్కంటేశ్వరరావు, నగేష్లతో పాటు మండలంలోని సర్పంచ్, వివిధ శాఖల అధికారులు, ఎన్డీఆర్ఎఫ్, ఎసీఅర్ఎఫ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# భద్రాచలం వద్ద గంజాయి పట్టివేత

- 15.5 కిలోల స్వాధీనం.. ఆరుగురు అరెస్ట్



**భద్రాచలం, మే 18, ప్రజా జ్యోతి:** భద్రాచలం కూనవరం ప్రధాన రహదారిపై ఇసుక ర్యాంపు సమీపంలో నిర్వహించిన ప్రత్యేక వాహన తనిఖీల్లో ఎక్సైజ్ అధికారులు 15.500 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో నాలుగు ద్విచక్ర వాహనాలు, ఐదు మొబైల్ ఫోన్లను సీజ్ చేసి ఆరుగురిపై కేసు నమోదు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జి. జనార్ధన్ రెడ్డి, డిప్యూటీ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎస్. జనయ్య ఆదేశాల మేరకు భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్ ఎస్హెచ్వో రహీమున్నీసా బేగం ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం ప్రత్యేక వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా వెళ్తున్న నాలుగు ద్విచక్ర వాహనాలను తనిఖీ చేయగా, వాటిలో మొత్తం 15.500 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. ఈ కేసులో ఖమ్మం జిల్లా గాంధీనగర్కు చెందిన సోమనబోయిన చరణ్, దండ సంజయ్ కుమార్, కామేపల్లికి చెందిన పరిమళ బన్ను, ఇల్లందు మండలం రాగబోయినగూడెంకు చెందిన జోగా సంతోష్, ఎట్టి జగపతి బాబు, కొర్లగుంపుకు చెందిన బియ్యాని మణివర్మలను అదుపులోకి తీసుకున్నారు. వీరు ఒడిశా రాష్ట్రం నుండి ఖమ్మం, ఇల్లందు ప్రాంతాలకు గంజాయిని అక్రమంగా తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నిందితుల వద్ద నుండి స్వాధీనం చేసుకున్న గంజాయి, నాలుగు ద్విచక్ర వాహనాలు, ఐదు మొబైల్ ఫోన్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్హెచ్వో రహీమున్నీసా బేగం వెల్లడించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ అల్లూరి సీతారామరాజు, హెడ్ కానిస్టేబుళ్లు కరీం, విల్సన్, కానిస్టేబుళ్లు సీతారామ్, రవి, వీరభద్రరావు, శ్రవణ్, రాకేష్, కిరణ్, మనోహర్, సుజాత పాల్గొన్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు టోల్ ఫ్రీ నెంబర్ 1800-425-2523 కు సమాచారం అందించాలని, సమాచారదారుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని అధికారులు తెలిపారు.

# పూర్తికాని డబుల్ బెడ్ రూం ఇండ్లపై లబ్ధిదారుల ఆందోళన

- నిధులు విడుదల చేసి నిర్మాణాలు పూర్తి చేయాలంటూ డిమాండ్
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారన్న మునిగడప వెంకటేశ్వర్లు



**కొత్తగూడెం, మే 18 ( ప్రజాజ్యోతి )** పాత కొత్తగూడెంలో గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2016లో పాత కొత్తగూడెంలో 826 డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం ప్రారంభించారని అయితే ఇప్పటికీ కనీసం 200 ఇళ్లు కూడా పూర్తికాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం నిర్మాణాలు పూర్తి కాకముందే హడావుడిగా డ్రా నిర్వహించారని విమర్శించారు. లబ్ధిదారులకు ఎలాంటి మంజూరు పత్రాలు ఇవ్వకుండా మోసం చేశారని ఆరోపించారు. డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలు పూర్తికాకపోవడంతో పాటు 75 గజాల స్థలం, ఇందిరమ్మ ఇండ్ల పథకాలలో కూడా లబ్ధిదారులను అనర్హులుగా ప్రకటించడం వల్ల పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి అదనపు నిధులు విడుదల చేసి నిర్మాణాలు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఎంపికైన అర్హులైన లబ్ధిదారులకే ఇళ్లు కేటాయించాలని అనర్హులు ఉంటే వారినే జాబితా నుంచి తొలగించాలని సూచించారు. మళ్లీ కొత్తగా డ్రా నిర్వహిస్తే పేదలకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఓం నారాయణ, గడిదాసు కుమార్, బత్తుల పద్మ, గౌస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు



చర్ల, మే 18: (ప్రజా జ్యోతి ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్ ఆదేశాల మేరకు, పీసీపీఎన్డీటీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరీష్ ఆధ్వర్యంలో ఆదివారం చర్ల మండలంలోని స్కానింగ్ సెంటర్లు ఆసుపత్రులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లు నిర్వహించే యాజమాన్యాలు సంబంధిత శాఖల అనుమతులు తప్పనిసరిగా పొందిన తర్వాతే సేవలు అందించాలని అధికారులు సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలలో భాగంగా చర్లలోని సాగర్ హాస్పిటల్లో గైనకాలజిస్ట్ లేకుండానే స్కానింగ్ మిషన్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. దీంతో గ్రామపంచాయతీ పోలీస్ శాఖ అధికారుల సమక్షంలో స్కానింగ్ మిషన్ ఉన్న గదిని సీజ్ చేశారు. దీనికి సంబంధించిన నివేదికను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి సమర్పించినట్లు తెలిపారు. ఈ తనిఖీల కార్యక్రమంలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రామదాస్, చర్ల పీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హారిక, డిప్యూటీ డెమో నాగలక్ష్మి, గ్రామపంచాయతీ వీఆర్ఏ, జూనియర్ అసిస్టెంట్ శ్రీధర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## చర్లలో ఘనంగా 2కే రన్



చర్ల, మే 18 : (ప్రజా జ్యోతి ): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99వ రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం చర్ల మండల కేంద్రంలో 2కే రన్ను ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ 2కే రన్ కార్యక్రమం చర్ల అంబేద్కర్ సెంటర్ వద్ద ప్రారంభమై మండల తహసీల్దార్ కార్యాలయం వరకు కొనసాగింది. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, శారీరక దృఢత్వం, సామాజిక బాధ్యతలను గుర్తుచేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. యువత సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చర్ల మండల ఎంపీడీవో ఈదయ్య, ఎంఈఓ రమణ, ఉప సర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, పంచాయతీ సెక్రటరీ సురేష్, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

## నాయి బ్రాహ్మణుడి సేవా స్ఫూర్తి



చర్ల, మే 18:(ప్రజా జ్యోతి ): చర్ల మండలంలో మానవత్వాన్ని చాటిచెప్పే ఘటన చోటుచేసుకుంది. చర్ల మండల నాయి బ్రాహ్మణ సేవా సంఘం 500/82 మండల కోశాధికారి అయినవిల్లి శ్రీనివాసరావు (శ్రీను) ఓ వృద్ధ బిక్షగాడికి ఉచితంగా గుండు గీసి సేవాభావాన్ని ప్రదర్శించారు. చేతివృత్తి చేసుకుంటూ జీవనోపాధి సాగిస్తున్న శ్రీను, వీధుల్లో బిక్షాటన చేసుకుంటూ తిరుగుతున్న వృద్ధుడిని చూసి చలించిపోయారు. ఎలాంటి పారితోషికం ఆశించకుండా స్వచ్ఛందంగా సేవ అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. సమాజ సేవలో ఎప్పుడూ ముందుండే శ్రీనివాసరావు చేసిన ఈ సేవా కార్యక్రమంపై స్థానికులు, నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు, సభ్యులు ప్రశంసలు కురిపించారు. "ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శం. మనుషుల్లో ఇంకా మానవత్వం బ్రతికే ఉందని ఇలాంటి ఘటనలు నిరూపిస్తున్నాయి" అంటూ అభినందించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ, నాయి బ్రాహ్మణ సేవా సంఘం తరఫున సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

# కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు మంకీ గన్స్ వితరణ






టేకులపల్లి, మే 18, ప్రజా జ్యోతి :టేకులపల్లి మండలంలోని 9వ మైల్ తండ,సాయన్నపేట గ్రామాలలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం రైతులకు మంకీ గన్స్ వితరణ చేశారు.ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయం విశ్వవిద్యాలయం చీడపీడల యాజమాన్య విభాగం,పంట పొలాల్లో అడవి పందుల బెడద పోతుల బెడద నుంచి పంటను రక్షించుకోవడానికి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి అతిథులుగా సీనియర్ శాస్త్రవేత్త డా. సునీత దేవి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ గిరిజన ఉపప్రణాళిక పథకంలో భాగంగా ఎంపిక చేసిన 20మంది రైతులకు కోతుల బెడద నుంచి కాపాడటానికి మంకీ గన్స్ ఇస్తున్నాం వీటిని రైతులు సక్రమంగా వాడుకొని కూరగాయపంటలను,వరి పొలాలను మొక్కజొన్న పంటలను కోతులు, అడవి పందుల బెడద నుంచి కాపాడుకోవచ్చని ఆమె సూచించారు. వీటిని సక్రమంగా వినియోగించుకుంటే రానున్న రోజుల్లో పెద్ద మొత్తంలో రైతులకు వీటిని అందించడానికి ముందుకు వస్తామని ఆమె తెలిపారు. కృషిజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.టి. భారత్ మాట్లాడుతూ రైతులు గత కొన్ని సంవత్సరాలుగా పంటలను పండించే క్రమంలో కోతులు, అడవి పందుల బెడద వలన చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారని తమ దృష్టికి తీసుకురావడం వల్ల రైతులకు మంకీ గన్స్, అడవి పందుల వలలు పంపిణీ కొరకు నైన్ మైల్ తండా, సాయన్నపేట గ్రామాలల్లో రైతులను ఎంపిక చేసుకోవడం జరిగిందని తెలియపరిచారు. రైతులు పంటలలో దిగుబడిని ఎక్కువ పొందాలని ఆశతో మోతాదుకు మించి ఎరువులను వాడుకుంటున్నారని తద్వారా భూసారం తగ్గిపోతుంది అని రైతులకు తెలియపరచడం జరిగినది. డా. శ్రీనివాస్ రెడ్డి, శాస్త్రవేత్త, చీడపీడల విభాగం మాట్లాడుతూ మంకీ గన్స్ ను ఎలా ఉపయోగించుకోవాలో డెమో ద్వారా రైతులకు సూచించారు. ఈ గ్రామాల్లోని ఇద్దరు చొప్పున రైతులకు అడవి పందులు బెడద నుంచి పంటలను రక్షించుకోవడానికి వల ను అందజేసి, ఎలా ఉపయోగించుకోవాలి అని రైతులకు సూచించారు. ఉద్యాన శాస్త్రవేత్త బి.శివ మాట్లాడుతూ మంకీ గన్స్ కూరగాయ పంటలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని తెలియపరచి, రానున్న రోజుల్లో వీటి ఉపయోగాన్ని మరింతగా విస్తృత పరుస్తామని రైతులకు తెలియపరిచారు.ఈ కార్యక్రమంలో మండల ఏవో అన్నపూర్ణ మాట్లాడుతూ రైతులు కెవికె భద్రాద్రి కొత్తగూడెం వారు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగపరచుకొని పంటలు నష్టాల బారిన పడకుండా రక్షించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో 60 మంది అభ్యుదయ మహిళ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో ఉత్సాహంగా 2కే మారథాన్

- **అన్నపురెడ్డిపల్లిలో భారీగా పాల్గొన్న అధికారులు, విద్యార్థులు, గ్రామస్తులు**





అన్నపురెడ్డిపల్లి, మే 18, ప్రజా జ్యోతి: ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో 2కే రన్ / మారథాన్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయం నుండి శివాలయం వరకు ఉదయం 9 గంటలకు నిర్వహించిన ఈ మారథాన్ను గ్రామ సర్పంచ్ లాకావత్ లక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. గ్రామంలో ఆరోగ్య చైతన్యం, క్రీడాస్ఫూర్తి పెంపొందించేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు. మారథాన్ సందర్భంగా పాల్గొన్న వారు నినాదాలతో ముం దుకు సాగుతూ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మారథాన్ అనంతరం అన్నపురెడ్డిపల్లి మండల స్పోర్ట్స్ ఆఫీసర్ సున్నం కృష్ణారావు పాల్గొన్న వారికి యోగాసనాలు చేయించి ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. క్రమం తప్పకుండా వ్యాయామం, యోగా చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి షేక్ షబ్నా, డిప్యూటీ తహసీల్దార్ జగదీశ్వరి, సబ్ ఇన్స్పెక్టర్ విజయ సింహారెడ్డి, మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద్ కుమార్, గ్రామ ఉపసర్పంచ్ మారగాని అశోక్, ఉపాధ్యాయులు గంగాధర్, రమేష్, కుమార్, వెంకట కృష్ణ, బిచ్చా, వివిధ గ్రామపంచాయతీల కార్యదర్శులు, పంచాయతీరాజ్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, ప్రజాప్రతినిధు లు, వార్డుసభ్యులు, క్రీడాకారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

# డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కోసం కలెక్టరేట్ ముట్టడి

- **పూర్తయిన 350 ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలంటూ డిమాండ్**



కొత్తగూడెం, మే 18 ( ప్రజాజ్యోతి ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణంలోని పాత కొత్తగూడెం నూతన వెన్నెలనగర్ కాలనీలో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇండ్లను తక్షణమే పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు లబ్ధిదారులు ధర్నా నిర్వహించారు. పెండింగ్లో ఉన్న 824 డబుల్ బెడ్రూమ్ ఇండ్ల నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా సేవ్ కొత్తగూడెం సేవ్ కార్పొరేషన్ కన్వీనర్, ఆవాజ్ పట్టణ కార్యదర్శి జలాల్ మాట్లాడుతూ.. దాదాపు 20 ఏళ్లుగా ఈ ఇళ్ల నిర్మాణం పూర్తికాకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికే పూర్తయిన 350 ఇళ్లను కూడా ఏడాదిన్నరగా పంపిణీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు చిట్టీలు ఇచ్చి మోసం చేశారని ఆ లబ్ధిదారులకు ప్రస్తుత ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పూర్తయిన ఇళ్లను వెంటనే నిరుపేదలకు కేటాయించకపోతే లబ్ధిదారులతో కలిసి ఆక్రమణ కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# ఓసి మల్టీ డిపార్ట్మెంటల్ టీమ్స్ నిర్వహణ





- ముఖ్య అతిథులుగా ఏరియా జిఎం. వి. కృష్ణయ్య

**టేకులపల్లి,మే18,ప్రజాజ్యోతి:** ఇల్లందు ఏరియా కోయగూడెం ఉపరితల గని సోమవారం మల్టీ డిపార్ట్మెంటల్ టీమ్స్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోయగూడెం ఓ.సి ప్రాజెక్ట్ ఆఫీసర్ యం.గోవిందరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులు ఏరియా జనరల్ మేనేజర్ వి.కృష్ణయ్యహాజరై,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇల్లందు ఏరియాలోని ఉద్యోగులందరికీ సింగరేణి సంస్థ యొక్క 2025-26 సంవత్సరంలో కంపెనీ సాధించినది వివరాలు 2026-27 సంవత్సరంలో కంపెనీ లక్ష్యాలను ఉత్పత్తి, ఉత్పాదకత సింగరేణిలో వాడుకలో ఉన్న మిషనరీ పని తీరు ఉత్పత్తి వ్యయం ఇల్లందు ఏరియాలో కంపెనీ భవిష్యత్తు ప్రణాళికలు కార్మికులకు సంస్థ అందించిన సంక్షేమ కార్యక్రమాలు వచ్చే ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఉత్పత్తి లక్ష్యాలను సాధించడానికి కార్యచరణ ప్రణాళిక రూపొందించడం పై మల్టీ డిపార్ట్మెంటల్ టీమ్స్ ను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. యంత్రాల పని గంటలు పెంచాలని ఆయన సూచించారు. సింగరేణి పై వినియోగదారుడు పెట్టుకున్న నమ్మకాని వమ్ము చేయకుండా నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి అందించాలని ఆయన తెలిపారు. మైన్లో ప్రమాదాలు లేకుండా సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఆయన తెలిపారు. ఉద్యోగుల నుంచి ఈ కార్యక్రమంపై సలహాలు ,సూచనలు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జి.యం. రామస్వామి, డీజియం పర్సనల్ అజీర తుకారాం, డి.జి.యం ఐ.ఇ.డి. ప్రభాకర్ రావు. డి.జి.యం ఏరియా వర్క్ షాప్ నాగరాజు నాయక్,క్వాలిటీ మేనేజర్ రామదాస్,జూనియర్ అకౌంట్ జగదేశ్, ఐ.టి మేనేజర్ ఆర్.చైతన్య, కేఓసి.గని మేనేజర్ పి.శ్రీనివాస్, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ నజీర్ అహ్మద్, ప్రాతినిధ్యసంఘం నుంచి బి. నాగేశ్వరరావు, సంక్షేమ అధికారులు ఇతర అధికారులు, ఉద్యోగులు, పాల్గొన్నరు.

## 99 రోజుల కార్యక్రమంలో భాగంగా 2కే రన్, యోగా కార్యక్రమాలు నిర్వహణ




**పాల్వంచ, మే 18, ప్రజాజ్యోతి:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక – 99 రోజుల కార్యక్రమంలో భాగంగా పాల్వంచ మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, లక్ష్మీదేవిపల్లి నుండి పెద్దమ్మతల్లి దేవాలయం వరకు మండల స్థాయి యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో "2కే రన్", "యోగా", "ఫిట్ అండ్ యాక్టివ్ తెలంగాణ మారథాన్" మరియు "ఫిజికల్ లిటరసీ" కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి బొగ్గ నారాయణ మాట్లాడుతూ యువత క్రమం తప్పకుండా యోగా, వ్యాయామాలు మరియు క్రీడల్లో పాల్గొని ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ప్రతి వ్యక్తి నిత్య జీవితంలో యోగా, వ్యాయామాలను భాగంగా చేసుకోవడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు క్రీడాస్ఫూర్తి పెంపొందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఏ. శ్రీరామ్ మూర్తి, పాల్వంచ రూరల్ ఎస్హెచ్వో బి. సురేష్, ఎంపీవో వై. చెన్నకేశవరావు, లక్ష్మీదేవిపల్లి సర్పంచ్ బి. మంజుల, కార్యదర్శులు, యువత పాల్గొన్నారు.

## దమ్మపేట ఎస్ఐగా రాజేష్ కుమార్

- ప్రస్తుత ఎస్సై సాయి కుమార్ రెడ్డి విఆర్ కు బదిలీ



**దమ్మపేట, మే 18, ప్రజాజ్యోతి :** మండల పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్స్పెక్టర్ గా రాజేష్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహించిన సాయి కుమార్ రెడ్డి వీఆర్ కు బదిలీ చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా, మండల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని నూతన ఎస్ఐ రాజేష్ కుమార్ పేర్కొన్నారు.

## పెట్రోల్ ధరల పెంపుపై న్యూడెమోక్రసీ వినూత్న నిరసన

- --టూ వీలర్కు తాళ్లు కట్టి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన
- --ఇంధన ధరల పెంపు ప్రజలపై భారమైంది: న్యూడెమోక్రసీ



**పాల్వంచ, మే 18, ప్రజాజ్యోతి:** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు పాల్వంచ నటరాజ్ సెంటర్లో ద్విచక్ర వాహనాలకు తాళ్లు కట్టి లాగుతూ వినూత్న రీతిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పాల్వంచ పట్టణ శాఖ కార్యదర్శి మంకెన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఐదు రాష్ట్రాల ఎన్నికల ముందు నుంచే చమురు సంక్షోభం కృత్రిమంగా సృష్టించబడుతోందని తమ పార్టీ వెల్లడించిందని, ఎన్నికల అనంతరం పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో అది నిజమైందని అన్నారు. ప్రపంచ యుద్ధాల పరిస్థితులను సాకుగా చూపిస్తూ చమురు యజమానుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. పెరిగిన ఇంధన ధరల ప్రభావంతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగి పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని, లేని పక్షంలో నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కే. మల్లేష్, వెంకటేశ్వర్లు, సంపత్, మహేష్, నరేష్, రాజేష్, రమణ, నాగరాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ లబ్ధిదారులు ఈ-కేవైసీ అప్డేట్ చేసుకోవాలి

- అవకాశాన్ని వినియోగించుకుని ఆధార్ వివరాలు నమోదు చేసుకోవాలని సర్పంచ్ లాకావత్ లక్ష్మి సూచన



**అన్నపురెడ్డిపల్లి, మే 18, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో పెన్షన్ పొందుతున్న లబ్ధిదారులందరూ తప్పనిసరిగా ఈ-కేవైసీ అప్డేట్ చేసుకోవాలని గ్రామపంచాయతీ అధికారులు సూచించారు. ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న ఫేస్ రికగ్నిషన్ విధానంలో భాగంగా పెన్షన్ దారుల ఫోటో, ఆధార్ వివరాలను ఆన్లైన్లో అప్లోడ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా నిజమైన లబ్ధిదారులకు మాత్రమే పెన్షన్ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ అప్డేట్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. పెన్షన్ దారులు తమ ఆధార్ కార్డు తీసుకుని గ్రామ కార్యదర్శి యూసఫ్ పటాన్ను కలిసి వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ అప్డేట్ చేయించుకోకపోతే భవిష్యత్తులో పెన్షన్ నిలిచిపోయే అవకాశం ఉండొచ్చని అధికారులు హెచ్చరిస్తున్నారు. అన్నపురెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో సుమారు 400 మంది పెన్షన్ లబ్ధిదారులు ఉన్నట్లు సమాచారం. వారిలో సోమవారం నాటికి సుమారు 120 మంది ఈ-కేవైసీ అప్డేట్ పూర్తి చేసుకున్నారని తెలిపారు. మిగతా వారు కూడా తమకు అనుకూల సమయంలో వచ్చి తప్పనిసరిగా అప్డేట్ చేసుకోవాలని కోరుతున్నారు. ఈ విధానం ద్వారా చనిపోయిన వారి పేర్లపై లేదా నకిలీగా కొనసాగుతున్న పెన్షన్లను పూర్తిగా నిర్మూలించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పెన్షన్ అందించేందుకు ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టిందన్నారు. గ్రామ సర్పంచ్ లాకావత్ లక్ష్మి, ఉపసర్పంచ్ మారగాని అశోక్, గ్రామ కార్యదర్శి యూసఫ్ పటాన్ గ్రామంలోని పెన్షన్ లబ్ధిదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో ప్రజలపై పెనుభారం

- కేంద్ర ప్రభుత్వంపై కొత్వాల విమర్శలు



**పాల్వంచ, మే 18, ప్రజా జ్యోతి:** కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచి సామాన్య, మధ్యతరగతి ప్రజల నడ్డి విరిచిందని రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే తీవ్ర ద్రవ్యోల్బణంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం మరోసారి ఇంధన ధరల భారం మోపడం దారుణమన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో వాహనదారులకే కాకుండా రవాణా ఖర్చులు పెరిగి, నిత్యావసర వస్తువుల ధరలు కూడా ఆకాశాన్నంటనున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సామాన్య, మధ్యతరగతి ప్రజల సంక్షేమాన్ని విస్మరించి కేంద్ర ప్రభుత్వం ప్రజలపై మరింత భారాన్ని మోపుతోందని ఆయన ఆరోపించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయ్యే వరకు ధరల పెంపుపై నిర్ణయాలు తీసుకోకుండా, ఎన్నికలు ముగిసిన వెంటనే ధరలు పెంచి ప్రజలను మభ్యపెట్టారని ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శలు గుప్పించారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని, లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టి బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతామని కొత్వాల హెచ్చరించారు.